ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
ఆదివారం 9 జూన్ 2024



అక్రమ వ్యవహారాలపై కఠిన చర్యలు : ఎస్పీ

రాయచూరు, జూన్ 8 : జిల్లాలో అక్రమ ఇసుక సేకరణ, రవాణా, మద్యం విక్రయాలు, క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూదం వంటి అక్రమాలకు పాల్పడే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.నిఖిల్ శనివారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. ఇప్పటికే ఇలాంటి అక్రమ వ్యవహారాలకు సంబంధించి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయన్నారు. ముఖ్యంగా లింగసుగూరు, మస్కి, సింధనూరు, బళగానూరు, రాయచూరు రూరల్, సిటీ పోలీస్ స్టేషన్లలో అక్రమాలకు సంబంధించిన కేసులు నమోదు కాగా అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



బెళగావి కాంగ్రెస్‌లో ముసలం



- మంత్రికి వ్యతిరేకంగా సవది, మహేంద్ర రహస్య సమావేశం
- అతడిని మెంటల్ ఆసుపత్రికి పంపుదాం
- సతీశ్‌జార్కిహోళిపై డీసీఎం ఆగ్రహం

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలకు కేంద్ర బిందువుగా ముద్రపడిన బెళగావిలో మరోసారి అధికార కాంగ్రెస్‌లో ముసలం రగిలింది. బెళగావి జిల్లాలో బెళగావి, చిక్కోడి రెండు లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. బెళగావి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మీ హెబ్బాళ్కర్ కుమారుడు మృణాల్ ఓడిపోయారు. చిక్కోడి నుంచి జిల్లాఇన్‌చార్జ్ మంత్రి సతీశ్‌జార్కిహోళి కుమార్తె ప్రియాంక విజయం సాధించారు. మంత్రి సతీశ్ జార్కిహోళి శుక్రవారం బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ చిక్కోడి అభ్యర్థికి ఇంకా మెజారిటీ వచ్చేదని, పార్టీకి చెందినవారే వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపించారు. అథణి ఎమ్మెల్యే లక్ష్మణ సవది, కుడచి ఎమ్మెల్యే మహేంద్ర తమ్మణ్ణవర్ వ్యతిరేకంగా వ్యవహరించారని ఆరోపించారు. వారు పరోక్షంగా బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. వారిద్దరు బీజేపీలోకి వెళ్తారా..? అనే మీడియా ప్రశ్నకు అది తనకు సంబంధించిన విషయం కాదని, వారినే అడగాలంటూ దాటవేశారు. ఎన్నికలకు సంబంధించి అధిష్టానానికి ఫిర్యాదు చేసేది లేదన్నారు. వారు చేసిన తప్పులను ప్రజల ముందు ఉంచుతా అన్నారు. తాము చిక్కోడి నియోజకవర్గాన్ని వేరు చేసుకున్నందునే విజయం సాధ్యమైందన్నారు. తాము ఓడిపోవాలని కేరళ, నేపాల్‌కు వెళ్లి పూజలు చేయించారని ఆరోపించారు. బెళగావి జిల్లాను విభజించాలని డిమాండ్ చేశారు. జిల్లా విభజన సుదీర్ఘకాలంగా ఉన్న డిమాండ్ అన్నారు. కాగా మంత్రి సతీశ్ జార్కిహోళి ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యేలు లక్ష్మణ సవది, మహేంద్ర తమ్మణ్ణ రహస్యంగా భేటీ అయ్యారు. అథణిలోని సవది ఇంటికి తమ్మణ్ణవర్ చేరుకోగా గంటల తరబడి వారు చర్చించుకున్నారు. లక్ష్మణసవది, మహేంద్ర తమ్మణ్ణ ఒకప్పుడు బీజేపీలో ఉన్నవారే. ఇటీవలే కాంగ్రెస్‌లోకి వచ్చి ఎమ్మెల్యేలు అయ్యారు.



మంత్రి సతీశ్‌జార్కిహోళి



ఎమ్మెల్యేలు మహేంద్ర తమ్మణ్ణవర్



లక్ష్మణసవది

అతడిని మెంటల్ ఆసుపత్రికి పంపుదాం : డీసీఎం



మంత్రి సతీశ్‌జార్కిహోళి వ్యాఖ్యలపై ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ అతడిని మెంటల్ ఆసుపత్రికి పంపుదామంటూ దాటవేశారు. సతీశ్ జార్కిహోళి బెళగావిలో మాట్లాడిన సమయంలో కాంగ్రెస్ పార్టీ 20 స్థానాల్లో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని, ప్రొడ్యూసర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలతోనే 9 స్థానాలకే పరిమితమయ్యామని పరోక్షంగా డీసీఎం డీకే శివకుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అందుకు డీసీఎం కూడా తీవ్రంగానే మాట్లాడారు.

వీరి విభేదాలతోనే సంకీర్ణ ప్రభుత్వం కూలింది

బెళగావికి చెందిన జార్కిహోళి కుటుంబం అంటే సంచలనాలకు మారుపేరు. 2018లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో జేడీఎస్‌తో కలసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో సతీశ్ జార్కిహోళితోపాటు అన్న రమేశ్ జార్కిహోళి కూడా కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలుగా ఉన్నవారే. కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో సతీశ్ జార్కిహోళి మద్దతుదారుడికి వ్యతిరేకంగా లక్ష్మీ హెబ్బాళ్కర్ అనుచరుడు పోటీ పడ్డాడు. ఈ వివాదం తీవ్రమయ్యేందుకు లక్ష్మీ హెబ్బాళ్కర్‌కు డీకే శివకుమార్ మద్దతు ఇచ్చారు. బెళగావి రాజకీయాల్లో డీకే శివకుమార్ జోక్యంపై రమేశ్ జార్కిహోళి జీర్ణించుకోలేకపోయారు. ఇద్దరిమధ్య తలెత్తిన విభేదాలు తారస్థాయికి చేరాయి. ప్రభుత్వాన్ని కూల్చేవరకు నిద్రపోనని సవాల్ విసిరారు. అలా 2019లో ఏకంగా 17మంది ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించడంతో సంకీర్ణ ప్రభుత్వం కూలింది. ఆ తర్వాత వారంతా బీజేపీలో చేరి మంత్రులైన విషయం తెలిసిందే. మరోసారి జార్కిహోళి, డీకే శివకుమార్ మధ్య వివాదం చెలరేగుతుండడంతో పరిస్థితి ఎక్కడికి దారి తీస్తుందోనని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

సీబీఐతోపాటు

రంగంలోకి ఈడీ

- వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు
- మరో మంత్రిపై ఆరోపణల వెల్లువ


బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ. 187 కోట్ల అవినీతిపై సీబీఐ దర్యాప్తు సాగిస్తోంది. కోట్లాది రూపాయల అవినీతి వ్యవహారం కావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం. యూనియన్ బ్యాంకు నుంచి కార్పొరేషన్ నిధులు హైదరాబాద్‌కు చెందిన పలు ఏజెన్సీలు, ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారు. మార్చి నెలలో యూనియన్ బ్యాంకు నుంచి రూ.94 కోట్లు అక్రమంగా నగదు బదిలీ చేసిన మేరకు బ్యాంకు డీజీఎం సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. అందుకు అనుగుణంగానే సీబీఐ దర్యాప్తు జరుపుతోంది. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశారు. ఎస్టీ కార్పొరేషన్ శాఖ మంత్రి నాగేంద్ర రాజీనామా అనివార్యమైంది. కోట్లాదిరూపాయల అవినీతి కావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగినట్టు సమాచారం. ఇప్పటికే మంత్రి నాగేంద్ర రాజీనామా చేయగా ప్రస్తుతం వైద్యవిద్యాశాఖ మంత్రి శరణప్రకాశ్‌పాటిల్‌పైనా ఆరోపణలు తీవ్రమవుతున్నాయి. కోట్లాదిరూపాయల అక్రమాలకు సంబంధించి సాక్ష్యాలను నాశనం చేసే కుట్ర మంత్రి శరణప్రకాశ్‌పాటిల్ కార్యాలయం నుంచే జరిగిందని ఎనిమిదో నిందితుడు, కార్పొరేషన్ అకౌంటెంట్ పరశురామ్ కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. మే 24న సాక్ష్యాల నాశనానికి సంబంధించి మంత్రి కార్యాలయంలో చర్చలు జరిగాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3వరకు కార్యాలయ సీసీ టీవీ ఫుటేజీలను స్వాధీనం చేసుకుని విచారణ జరపాలని పేర్కొన్నారు. మంత్రులు నాగేంద్ర, శరణప్రకాశ్ పాటిల్‌తోపాటు ఎమ్మెల్యే బసనగౌడ బాదర్లి పాల్గొన్నారని పేర్కొన్నారు. ఇదే విషయమై హోంశాఖ మంత్రి పరమేశ్వర్ స్పందిస్తూ వివాదంలో ఇరుక్కున్నవారు చేసిన ఆరోపణలన్నీ వాస్తవాలై ఉండవని, అన్ని కోణాలలో విచారణలు జరుపుతామన్నారు. కార్పొరేషన్‌కు సంబంధించి కోట్లాది రూపాయలు కాజేసే విషయమై విలాసవంతమైన హోటల్‌లో సభలు జరిపారని సిట్ విచారణలో బహిర్గతమైంది. హైదరాబాద్‌కు చెందిన ఫస్ట్ ఫైనాన్స్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఇటకారిని విచారణ జరిపిన వేళ మధ్యవర్తులు చంద్రమోహన్, సత్యనారాయణవర్మ ప్రధాన సూత్రధారులనే సమాచారం వెలుగులోకి వచ్చింది. మరోవైపు వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాదిరూపాయల నగదు బదిలీకి ఎందుకు చేశారో ముఖ్యమంత్రికి తెలిసి ఉంటుందని సీబీఐ ఆయనను కూడా విచారణ జరపాలని బీజేపీ ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి డిమాండ్ చేశారు. మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ మీడియాతో మాట్లాడుతూ రూ. 187 కోట్ల అవినీతి వెనుక పెద్ద ముఠా ఉందని బెంగళూరుకు వచ్చిన రాహుల్‌గాంధీ ఈ విషయమై ఎందుకు ప్రశ్నించలేదన్నారు.



గ్యారెంటీలు నిలిపివేయాలి

- మైసూరు కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీలకు వ్యతిరేకంగా ఓట్లు వేశారని మైసూరు కాంగ్రెస్ అభ్యర్థి ఎం. లక్ష్మణ్ మండిపడ్డారు. శనివారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీలను నిలిపివేయడం మంచిదని సూచించారు. ఎన్నికలవేళ బీజేపీ నాయకులు గ్యారెంటీలను విమర్శించారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. ప్రజలు కూడా బీజేపీకి మద్దతు ఇచ్చారంటే గ్యారెంటీలకు వ్యతిరేకమనే అర్థం అన్నారు. ఇలా ఐదు గ్యారెంటీలను నిలిపివేయాలని ముఖ్యమంత్రిని కోరుతా అన్నారు. ముఖ్యమంత్రిని అవమానించడం సరికాదన్నారు. ఆయన సొంతజిల్లా మైసూరు, కొడగు ప్రాంతాల్లోనే ఓటమి జరిగిందన్నారు. ఇది ఆయనకు జరిగిన అవమానం అన్నారు. కులాలతో సంబంధం లేకుండా వ్యవహరించే మరో ముఖ్యమంత్రి రాష్ట్రానికి లభించడం సాధ్యమా..? అని ప్రశ్నించారు. ఇంతకూ సిద్దరామయ్య చేసిన తప్పు ఏమిటన్నారు. తన పాలిట సిద్దరామయ్య దేవుడు అన్నారు. ఎన్నికల్లో సీఎంతోపాటు డీసీఎం డీకే శివకుమార్ సహకారానికి ధన్యవాదాలు అన్నారు. కొత్త ఎంపీ యదువీర్‌కు అభినందనలు తెలిపారు. గత ఎంపీ తరహాలో నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేయరాదని, మైసూరుకు కొత్త ప్రాజెక్టులు తేవాలని సలహా ఇచ్చారు.



15 నుంచి దక్షిణభారత్ ఉత్సవ్

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత పర్యాటక సమగ్ర అభివృద్ధి కోసం ఈనెల 15 నుంచి రెండు రోజులపాటు దక్షిణభారత ఉత్సవ్ నిర్వహిస్తున్నట్టు మంత్రి హెచ్‌కే పాటిల్ తెలిపారు. శనివారం లోగోను ఆవిష్కరించారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరి, తెలంగాణ, లక్షద్వీప్, కేరళ రాష్ట్రాల పర్యాటక విభాగాలు భాగస్వామ్యం అవుతాయన్నారు. దీనిని ఎఫ్‌కేసీసీఐ, రాష్ట్ర పర్యాటకశాఖ సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. పర్యాటక శాఖ డైరెక్టర్ రాంప్రసాద్ మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 900 పర్యాటక స్థలాలను గుర్తించామని, రూ.472 కోట్లతో వాటిని సర్వాంగా సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఉత్సవ్‌లో 900 పర్యాటక స్థలాల సమాచారం ప్రదర్శిస్తామన్నారు. ఎఫ్‌కేసీసీఐ చైర్మన్ రమేశ్‌చంద్ర లహోటి, పర్యాటక విభాగం చైర్మన్ శివషణ్ముగంతోపాటు దక్షిణభారత్ ఉత్సవ్ సమితి ముఖ్యులు జీకే శెట్టి పాల్గొన్నారు. ఏడు రాష్ట్రాల కళలు, సంప్రదాయాలను పరిచయం చేస్తామన్నారు.

డీకే సురేశ్ ఓటమికి సీఎం వర్గమే కారణం

- బీజేపీ ఎమ్మెల్యే ఆరోపణ

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రామీణ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్ చిత్తుగా ఓడేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన వర్గమే కారణమని బీజేపీ ఎమ్మెల్యే సురేశ్‌గౌడ పేర్కొన్నారు. తుమకూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సిద్దరామయ్య నిరంతరంగా సీఎంగా కొనసాగారని, అహింద టీమ్ పని చేస్తుంటుందన్నారు. ఆ బృందమే డీకే సురేశ్‌ను ఓడించిందన్నారు. సతీశ్‌జార్కిహోళి, పరమేశ్వర్, రాజణ్ణ, సిద్దరామయ్య కలసి డీకే సురేశ్‌ను ఓడించారన్నారు. ఎన్నికలకు ముందే రెండు లక్షల తేడాతో సురేశ్ ఓడిపోతారని చెప్పానని అన్నారు. ఇదంతా సిద్దరామయ్య కుట్రలో భాగమని, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కారాదని, ఆయనను నైతికంగా కుంగదీసేందుకు ఇలా చేశారని ఆరోపించారు. ఎన్నికల పరిణామంతో డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కాలేరని జోస్యం చెప్పారు. నాయకత్వ మార్పు ఉండదన్నారు. బెంగళూరు గ్రామీణ ఓటమితో పార్టీలో అంతర్గత కలహాలు పెరుగుతాయన్నారు.

పరిషత్‌లో మారనున్న బలాబలాలు

- సభాపతి స్థానంపై కాంగ్రెస్ కన్ను
- బీజేపీ-జేడీఎస్ మైత్రితో ఢోకా లేనట్టే

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ బలంలో మార్పులు చోటు చేసుకుంటున్న తరుణంలో అధికార కాంగ్రెస్ సభాపతి స్థానంపై కన్ను వేసింది. రాష్ట్రంలో బీజేపీ, జేడీఎస్ మైత్రిగా ఉండడంతో ప్రస్తుతానికి సభాపతి బసవరాజ హొరట్టి పదవికి ఢోకా లేనట్టే కనిపిస్తోంది. మూడురోజుల క్రితం శాసనసభ కోటా నుంచి 11 మంది ఎమ్మెల్సీలు ఎన్నికయ్యారు. వీరితోపాటు మూడు పట్టభద్రులు, మూడు ఉపాధ్యాయ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 17 స్థానాల్లో అధికార కాంగ్రెస్ 10 స్థానాలను దక్కించుకుంది. మిగిలినవాటిలో బీజేపీ 4, జేడీఎస్ 3 స్థానాలు గెలుపొందాయి. దీంతో పరిషత్‌లో కాంగ్రెస్ బలం 34కు పెరిగింది. బీజేపీ సభ్యుల సంఖ్య 30 కాగా జేడీఎస్ నుంచి 8మంది ఉన్నారు. సభాపతిస్థానంతోపాటు ఇండిపెండెంట్ ఒకరు ఉన్నారు. జగదీశ్‌శెట్టర్ రాజీనామాతో ఒక స్థానం ఖాళీగా ఉంది. ఈ స్థానానికి కాంగ్రెస్ పార్టీ బసనగౌడ బాదర్లి పేరు ప్రకటించింది. ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. ప్రస్తుతం పరిషత్‌లో ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తున్న కోట శ్రీనివాసపూజారి ఉడుపి - చిక్కమగళూరు ఎంపీగా గెలుపొందారు. దీంతో ఆ స్థానానికి రాజీనామా చేయనున్నారు. ఇలా మరో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కానుంది. సభాపతి బసవరాజహొరట్టి 2022లో బీజేపీలో చేరారు. ఆ తర్వాత ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి ఏడోసారి గెలుపొందారు. బీజేపీ మద్దతుతో సభాపతి అయ్యారు. ప్రస్తుతానికి బీజేపీ-జేడీఎస్ కూటమిగా ఉండడంతో ఇండిపెండెంట్ ఎమ్మెల్సీ లఖన్ జార్కిహోళితో కలిపి 40 మంది అవుతారు. ఈ ఏడాది ఆఖరులో కాంగ్రెస్‌కు మరింత బలం పెరిగే అవకాశం ఉంది. అప్పటిదాకా హొరట్టి పదవికి ఢోకా లేనట్టే.



ఆల్మట్టికి జలకళ

బళ్లారి గాంధీనగర్, జూలై 8: కృష్ణానదిపై నిర్మించిన ఆల్మట్టి జలాశయం వరదనీటితో కళకళలాడుతోంది. మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా భారీ ప్రమాణంలో ఆల్మట్టి జలాశయానికి వచ్చి చేరుతున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు. గత ఏడాది వర్షాలు లేని కారణంగా పూర్తి స్థాయిలో జలాశయం భర్తీ కాలేదు. ఈ ఏడాది కురుస్తున్న వర్షాల కారణంగా అధిక ప్రమాణంలో వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయానికి 2,578 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కృష్ణానది తీరప్రాంతాల్లో ప్రజలు, రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ఇదే జూన్ నాటికి ఆశించిన మేర ఇన్‌ఫ్లో లేదు. ఈ ఏడాది జూన్ మొదటివారంలోనే ఇన్‌ఫ్లోతో కృష్ణానది తీర ప్రాంతాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆల్మట్టి జలాశయం

అస్తమా మందుకోసం పోటెత్తిన జనం



బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె వేళ అస్తమాకు మందు పంపిణీ చేసే సంప్రదాయం కొప్పళ జిల్లా కుటుగనహళ్లి గ్రామంలో కులకర్ణి కొనసాగిస్తోంది. ఈ ఏడాది అంచనాలకు మించి ప్రజలు వచ్చారు. శనివారం ఉదయం 8గంటలలోపు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా శుక్రవారం సాయంత్రమే కుటుగనహళ్ళికి 70-80వేలమందికి పైగా చేరుకున్నారు. రాత్రి గ్రామంలో ఎక్కడా చూసినా ప్రజలు కనిపించారు. మరోవైపు భారీ వర్షం రావడంతో జనం ఇబ్బంది పడ్డారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, గోవా, తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్దసంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే మందు పంపిణీ ప్రారంభించారు. 7.47 గంటలలోపు మందు పంపిణీ ముగించాల్సి రావడంతో భారీగా ఏర్పాట్లు చేశారు. గవిసిద్దేశ్వర స్వామిజీ ముఖ్యులుగా పాల్గొన్నారు. అశోక్ కులకర్ణి పర్యవేక్షణలో మందు పంపిణీ చేశారు. కుటుగనహళ్లి గ్రామంలో గడిచిన 60ఏళ్లుగా కులకర్ణి కుటుంబీకులు అస్తమాకు మందు ఇస్తున్నారు. ఇక్కడ ఇచ్చే మందు మృగశిర కార్తెవేళ స్వీకరిస్తే అస్తమా నియంత్రణ అవుతుందనే విశ్వాసం ఉంది. వరుసగా మూడేళ్లు మందు తీసుకుంటే అస్తమా పూర్తిగా నయమవుతుందని నమ్ముతారు. ఇదే కారణంతోనే వివిధ రాష్ట్రాల వారు వస్తున్నారు. తొలుత వ్యాసరావు కులకర్ణి మందు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆయన కుమారుడు అశోక్‌కులకర్ణి ఇదే ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఇందుకోసం ఏడాదిగా మందు తయారీ చేసుకుంటారు. దశాబ్దాలకాలంనాటి పాతబెల్లంతో మందును గుళికల రూపంలో అందిస్తారు. ఈ గుళికలు తయారు చేసేందుకు కులకర్ణి కుటుంబం 15 రోజులపాటు పనిచేస్తుంది. ఇదే విషయమై అశోక్ కులకర్ణి మాట్లాడుతూ మా తండ్రి కాలం నుంచి మందు పంపిణీ చేస్తున్నామని ప్రస్తుతం అదే ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఎక్కువమంది వచ్చారన్నారు.




అస్తమాకు అందజేసే మందులు



గ్రామానికి చేరిన జనం

పంపిణీ చేస్తున్న దృశ్యం



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.86	1,581.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1490	468
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10	246
సామర్థ్యం (టీఎంసీలు)	3.94	5.03

ఎస్‌డీఎంసీ అధ్యక్షుడిగా ఎన్నికైన గణేష్

సిరుగుప్ప, జూన్ 8 :నాగరహాళ్ గ్రామం ఎస్‌డీఎంసీ అధ్యక్షులుగా గణేష్ ఎన్నికయ్యారు. సిరుగుప్ప తాలుకాలోని నాగరహాళ్ గ్రామంలో ప్రముఖ పాఠశాల సభ్యులు అధ్యక్షునిగా గణేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చదువుల కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామప్రముఖులు ఎండీ షెక్షావలీ, బాషా సాబ్, రామచంద్రప్ప, చెన్నారెడ్డి, హుస్సేన్ నాయక్, గ్రామ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం పట్టణంలో అపరిశుభ్రతపై కలెక్టర్ కొరడా



సైకిల్‌పై నగరపర్యటన చేస్తున్న కలెక్టర్ దివాకర్

బళ్లారి సిటీ,జూన్ 8: రెండో శనివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో కలెక్టర్ ఉదయాన్నే నగర పర్యటన చేశారు. పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉండడంతో సంబంధీకులపై కొరడా ఝుళిపించారు. వర్షాలు కురుస్తుండడంతో రాజయ్య కాలువల్లో చెత్త, ప్లాస్టిక్‌ను తొలగిస్తామని రెండు రోజుల క్రితమే చెప్పారని ఇంత వరకు చెత్తను తొలగించలేదని జిల్లా కలెక్టర్ దివాకర్ అన్నారు. కెకెఆర్‌టీసీ బస్టాండ్ వెనుక పరిశుభ్రత అక్కడే మురుగునీరు ప్రవహించడం చూసి కలెక్టర్ చలించిపోయారు. ఇంత దుర్వాసన వెదజల్లుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని డిపో మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాన్యువల్ స్కావెంజర్ చట్టం కింద నోటీసులిచ్చి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన వెంట ఉన్న మున్సిపల్ కమిషనర్ చంద్రప్పను ఆదేశించారు. బస్టాండులోని పబ్లిక్ టాయిలెట్స్‌లో ఎక్కువ డబ్బులు వసూలు చేయడంపై ప్రజాప్రతినిదులు టీసీకీ ఫిర్యాదు చేశారు. ఎక్కువ డబ్బులు తీసుకోవద్దని అక్కటిక్కటే సంబంధితులను హెచ్చరించాడు. బస్టాండ్ సమీపంలోని విశ్వా లాడ్జి ఎదురుగా ఉన్న డ్రైనేజీ లైన్ లో నీరు నిలిచి బస్టాండ్ ఎదురుగా ప్రవహించడం చూసి జిల్లా కలెక్టర్ వాపోయారు. లాడ్జిలోకి ప్రవేశించి తనిఖీ చేయగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా లాడ్జి నడుపుతున్నట్లు గుర్తించారు. వెంటనే నోటీసులిచ్చి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. మొత్తం నగర డ్రైనేజ్ వ్యవస్థను బాగు చేసేందుకు అవసరమైన డీపీఆర్‌ను సిద్దం చేయాలని అధికారులను ఆదేశించారు.నగర నడిబొడ్డున ఉన్న వివేకానంద ప్రభుత్వ ప్రాథయిక పాఠశాలను జిల్లాకలెక్టర్ దివాకర్ సందర్శించగా 8గంటలైన పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సమయానికి పాఠశాలకు రాని ఉపాధ్యాయులందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

దిష్టిబొమ్మగా మారిన ఆర్వో ప్లాంటు



ముళ్లకంపల మధ్యలో వున్న ఆర్వోప్లాంటు

కంప్లి, జూన్ 8 : కొట్టూరు పట్టణ సముదాయ ఆస్పత్రి వద్ద ఆర్‌వో ప్లాంటు దిష్టిబొమ్మగా మారింది. దాని మరమ్మతుల పట్ల పట్టణ పంచాయతీ అధికారులు, నీటి పారుదల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చి వెళుతున్నారని, కానీ అక్కడి నీటి సమస్యపై అధికారులు దృష్టి సారించకపోవడంతో చుట్టూ ముళ్లమొక్కలు మొలిచాయి. ఇప్పటికైనా అధికారులు ముందుకొచ్చి ఆర్‌వో ప్లాంటుకు మరమ్మతు పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి రాజీనామా జిల్లా అభివృద్ధికి ఆటంకమా?

- ఇకపై ఎవరిని అడగాలంటున్న ప్రజలు



మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత నాగేంద్ర(ఫైల్)

బళ్లారి, జూన్ 8(ఆంధ్రజ్యోతి)

మంత్రి నాగేంద్ర రాజీనామా కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారితీస్తోంది. జిల్లాలో బలంగా ఉండే బీజేపీని ఓడించడంలో మంత్రి నాగేంద్ర కృషి ఎక్కువగానే ఉంది. మంత్రి రాజీనామా తరువాత బళ్లారి జిల్లా అభివృద్ధి, పెండింగ్‌లో ఉండే వివిధ అభివృద్ధి పనుల గురించి సర్కారుతో మాట్లాడేదెవరు? అనే చర్చ ప్రజల్లో సాగుతోంది.

బళ్లారి రూరల్ నుంచి మంత్రి బి. నాగేంద్ర 25వేల ఓట్లు ఆధిక్యతతో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు పై విజయం సాధించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా అదీ ఎస్టీ నాయకుడుగా రాష్ట్ర వ్యాప్తంగా పేరు ఉండే శ్రీరాములు లాంటి నాయకుడిని ఓడించడం సాధ్యం కాదని అందరూ అనుకున్నారు. కానీ ఎమ్మెల్యేగా పోటీ చేసిన నాగేంద్ర తన బలం ఏమిటో చూపించారు. శ్రీరాములు ను ఓడించి రాష్ట్ర రాజకీయ పార్టీలు అన్నీ తన వైపు చూసేలా నాగేంద్ర చేయగలిగారు.

2023 మే 27న మంత్రిగా నాగేంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టాక బళ్లారి రూరల్ పరిధిలో చాగనూరు విమానాశ్రయం, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, నవోదయ పాఠశాల, మహిళా కళాశాల, రూ. 125 కోట్లతో మెగా డెయిరీ, సంగనకల్లు వద్ద ఉండే ఆదిమానవులు నివసించిన పురాతన ప్రాంత అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయి జీన్స్‌పరిశ్రమ, ఫ్లైఓవర్ల నిర్మాణం తదితర పనులన్నీ ఊపందుకున్నాయి. అలాగే రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉండే గిరిజనులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలనుకుంటున్నట్లు ఆయన అనేక సందర్భాల్లో ప్రెస్ మీట్‌లో చెప్పారు. రాహుల్ గాంధీ పాదయాత్ర, అలాగే ఎన్నికల ప్రచారయాత్ర నిర్వహించిన సమయంలోనూ బళ్లారిలో అంతర్జాతీయ స్థాయిలో జీన్స్ పరిశ్రమ నిర్మాణం చేస్తామని చెప్పారు. ప్రస్తుతం నాగేంద్ర మంత్రి వర్గం నుండి తప్పుకున్నాక ఈ హామీలు నెరవేరుతాయా? ఈ అభివృద్ధి పనులపై సర్కారుతో చర్చించేదెవరు అనే ప్రశ్న నెలకొంది.

నాగేంద్ర ఒక్కడే ఈ పని చేసి ఉండరు... ఇందులో ఏదో దాగి ఉంది

ఎస్టీ నిగమ మండలి బ్యాంకు ఖాతా నుండి రూ. 187 కోట్లు వేరే బ్యాంకుకు తరలివెళ్లడం, ఆ బ్యాంకు ఖాతా నుండి వేరే బిజినెస్ ఖాతా దారురుల ఖాతాల్లోకి డబ్బులు మారడం రాష్ట్రంలో చర్చనీయాంశం అయింది. ఈ ఖాతా మార్పు, నిధుల డ్రా మంత్రి బి. నాగేంద్ర ఒక్కరే చేయడానికి సాధ్యం అవుతుందా..? ప్రభుత్వ పెద్దలు, బ్యాంకర్ల, ప్రమేయం లేకుండానే నాగేంద్ర ఇంత డబ్బులు డ్రా చేసుకోగలడా అనే అనేక సందేహాలు తలెత్తున్నాయి. పైగా మంత్రి నాగేంద్ర ఒక్కడినే బలిపశువును చేశారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎస్టీ నిగమ మండలి బ్యాంకు ఖాతా నుండి డబ్బులు డ్రా చేయడం వెనుక ఏదో జరిగి ఉంటుందని ఆయనతో సన్నిహితంగా ఉండే స్నేహితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 'నాగేంద్రని మేము ముందు నుంచి చూస్తున్నాము. మర్యాదకు ప్రాణం ఇచ్చేవాడు. డబ్బుల కోసం మర్యాద పోగొట్టుకోడు, అతను ఎంతో మందికి సహాయం చేశారు. అంతేకాని తనకు మర్యాద పోతుందను కుంటే అలాంటి పని చేయడు' అని ఆయన సన్నిహితులు ఆయన గురించి చెబుతున్నారు. ఎవరో పెద్దలే ఈ పని చేయించి నాగేంద్రను బలిపశువును చేశారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

మొత్తం మీద ఊహించని పరిణామంతో మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా చేశారు. విచారణ తర్వాత నిర్దోషి అని తేలితే మళ్లీ పదవి ఖాయమని చెబుతున్నప్పటికీ అప్పటివరకూ మరి అభివృద్ధి మాటేంటి? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బళ్లారిలో భారీ వర్షం

బళ్లారిరూరల్, జూన్ 8 : వారంరోజులుగా బళ్లారి నగరం, గ్రామీణ ప్రాంతాలలో రోజూ వర్షం పడుతుండటంతో ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం గ్రామీణ ప్రాంతాలలో భారీగా వర్షం కురిసింది. దీంతో మోకా గ్రామంలోని పాఠశాలలో వర్షపునీరు చేరి చెరువును తలపించింది.

కంప్లిలో ఎక్కడ చూసినా నీరే



అడవిలో నుంచి గ్రామంలోకి వస్తున్న నీరు

కంప్లి, జూన్ 8 : గ్రామాల్లో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసినా నీటి మడుగులే కనిపిస్తున్నాయి. శుక్రవారం కంప్లి పరిధిలోని దేవలాపురం గ్రామం వద్ద కురిసిన భారీ వర్షానికి గ్రామంలో ఎక్కడ చూసినా నీటి మడుగులే వున్నాయి. అలాగే కురుగోడు, కంప్లిలో కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. మొత్తానికి ఈ యేడాది సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల విత్తనం పనులు కూడా ప్రారంభించారు.

రామోజీరావు సేవలు మరువలేనివి

కమ్మవారి మహాజనసంఘం ఘననివాళి

సిరుగుప్ప, జూన్ 8 : రామోజీరావు ఎప్పటికీ మరువలేని వ్యక్తి అని కమ్మసంఘం గౌరవాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసరావు అన్నారు. సిరుగుప్ప పట్టణం కమ్మసంఘం భవనంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదేవిధంగా కమ్మసంఘం మాజీ అధ్యక్షులు శంకర్‌రావు సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మసంఘం అధ్యక్షులు జాలాది రాధాకృష్ణ, ప్రముఖులు సురేష్‌బాబు, గణేష్ రావు, శ్రీనివాసరావు, ప్రసాద రావు, రఘు కిరణ్, మాజీ అధ్యక్షులు రమేష్‌బాబు, కోనేరు గోపాల కృష్ణ, దేవీనగర్ ప్రతాప్ చౌదరి, కమ్మసంఘం సర్వసభ్యులు పాల్గొన్నారు.



సిరుగుప్ప కమ్మసంఘం సభ్యులు రామోజీరావుకు నివాళులర్పిస్తున్నదృశ్యం



సంతాపం తెలుపుతున్న రాఘవ మెమోరియల్ అసోసియేషన్

రాఘవ కళామందిరంలో ...

బళ్లారి సిటీ, జూన్ 8: బళ్లారి రాఘవ మెమోరియల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈనాడు గ్రూప్ సంస్థ చైర్మన్ రామోజీరావు మృతికి సంతాపంగా శనివారం రాఘవ కళామందిరంలో సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాఘవ మెమోరియల్ అసోషియేషన్ గౌరవాధ్యక్షులు చన్నప్ప, అధ్యక్షులు కోటేశ్వరావు, సంస్థ కార్యదర్శి ప్రకాశ్,చెల్లా అమర్‌నాథ్ చౌదరి, చంద్రశేఖర్, కృష్ణ, భీమనేని భాస్కర్, రమణప్ప భజంత్రి, ఎన్.బసవరాజు తదితరులు సంతాపం తెలిపారు.



మాట్లాడుతున్న కొల్లి శ్రీనివాసరావు

కంప్లి కమ్మసంఘం ఆధ్వర్యంలో..

కంప్లి, జూన్ 8 : రామోజీ ఫిల్మ్‌సిటీ వ్యవస్థాపకులు రామోజీరావు మృతి చెందడంతో శనివారం కంప్లి కమ్మసంఘం ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు కమ్మసంఘం నాయకులు మాట్లాడుతూ రామోజీరావు దేశ విదేశాలలో మంచి గుర్తింపు పొందారన్నారు. సినీ రంగానికి, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, బట్టా ప్రసాద్, కిషోర్, బాలకృష్ణ, పురుషోత్తమ్, శ్రీనివాసులు, సత్యనారాయణ, పుల్లయ్య, రమేష్, సీపీ చౌదరి, శ్రీధర్, కమ్మసమాజం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కంప్లి కమ్మసంఘం నాయకులు

బళ్లారి కమ్మ భవనంలో రామోజీరావు సంతాప సభ

బళ్లారి సిటీ, జూన్ 8: ఈనాడు పత్రిక అధినేత రామోజీరావు మృతికి కమ్మమహాజన సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని కమ్మభవనంలో శనివారం మధ్యాహ్నం జరిగిన నివాళి కార్యక్రమంలో బళ్ళారి కమ్మమహాజన సంఘం ఉపాధ్యక్షులు ముల్లంగి చౌదరి, అమరేంద్రనాథ్ చౌదరి, అభిలాష, సీన, లాల్‌మోహన్, వెంకటనాయుడు, బోయపాటి విష్ణువర్ధన్, లత్తవరం మల్లికార్జున, శ్రీనివాసులు, కరూర్ ప్రకాశ్, రాజేంద్రప్రసాద్, ఎర్రిస్వామి, రామాంజి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే శనివారం స్వర్గస్థులైన రామోజీరావుకు నగరంలోని ఫైర్‌స్టేషన్ దగ్గర ఈనాడు పేపర్ ఏజెంట్స్, అండ్ బాయ్స్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీ రావు గారి మృతి బాదాకరమన్నారు. జర్నలిజం విలువలు కాపాడిన మహోన్నత వ్యక్తి రామోజీరావు పవిత్రమైన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



రామోజీరావుకు నివాళులర్పిస్తున్న బళ్లారి కమ్మమహాజన సంఘం నేతలు

ఈసందర్భంగా కమ్రుద్దీన్, దివాకర్, రంగస్వామి, ఎర్రిస్వామి, పరుశురామ్, జగన్, మురళి, శ్రీహరి, మల్లి, గోవిందు, వెంకట్, కిరణ్, నాగరాజు, గణేశ్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పేపర్ ఏజెంట్స్, అండ్ బాయ్స్ ఆధ్వర్యంలో ...



నివాళులర్పిస్తున్న సిరుగుప్ప జర్నలిస్టులు

కొనసాగుతున్న వర్షాలు

- నీటమునిగిన నగర రోడ్లు.. నీటిమడుగులో ఏపీఎంసీ
- అండర్‌పాస్‌లో నీరు నిలవడంతో వాహనాల బారులు
- ఏపీఎంసీ-కాకర్ల తోట ప్రాంతానికి రాకపోకలు బంద్



దొడ్డనగౌడ రంగమందిరం వద్ద అండర్‌పాస్‌లో నిలిచిన నీరు

బళ్లారి గాంధీనగర్, జూన్ 8: నగరంలో వర్షం వచ్చిందంటే చాలు... అండర్‌పాస్‌లు, రోడ్లు అన్ని జలమయం కావల్సిందే. మురికి కాలువలు పొంగిపొర్లి రోడ్ల పైకి రావడంతో రోడ్లు అన్ని అపరిశుభ్రంగా మారడం నగరంలో వర్షం వచ్చిన ప్రతిసారి పరిపాటిగా మారింది. నగరంలో రెండురోజులుగా కురిసిన వర్షం కారణంగా ప్రధానంగా సత్యనారాయణ పేట అండర్‌పాస్, దుర్గమ్మగుడి అండర్‌పాస్, కౌల్‌బజార్‌కు వెళ్ళే దొడ్డనగౌడ రంగమందిరం వద్ద అండర్‌పాస్‌లో వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో గాంధీనగర్, కౌల్‌బజార్, బెంగళూరు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. రోడ్లపైనే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇక వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లో సరిగా డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో వర్షం నీరు దిగువ ప్రాంతంలో అంగళ్లముందు నిలిచిపోవడంతో కొంతమేర ఏపీఎంసీ వ్యాపారాలు స్తంభించాయి. ఏపీఎంసి మార్కెట్ నుండి కాకర్లతోటకు వెళ్ళే మధ్య వాగు పొంగి ప్రవహించడంతో కాకర్ల తోట ప్రాంతాలకు వెళ్ళేవారు గుగ్గరహట్టి మీదుగా వెళ్లాల్సి వచ్చింది. కాకర్లతోట ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. అదేవిధంగా పాత తాసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో భారీ ప్రమాణంలో నీరు నిలువడంతో ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేక జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంగణంలో బళ్ళారి రూరల్, బ్రూస్ పేట పోలీసు స్టేషన్‌లతో పాటు జిల్లా వ్యవసాయ శాఖ, తాలూకా వ్యవసాయ శాఖ, జిల్లా ఉద్యానవన శాఖ, జిల్లా ఎంప్లాయిమెంట్, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి వీఏఓ కార్యాలయాలు ఇదే ప్రాంగణంలో ఉండడంతో కార్యాలయాలకు వెళ్ళాలంటే వర్షంలోనే ప్యాంట్లు, పంచెలు తడుపుకుని వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కొత్తగా జిల్లా పాలనా మండలి భవనం ప్రారంభం కావడంతో ఆ భవనంలోకి తాసీల్దారు కార్యాలయాన్ని మార్చడంతో ఈ ప్రాంగణంలో నెలకొన్న దుస్థితిపై అధికారులు ఎవరూ దృష్టి సారించలేదు. దీంతో ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వాగుపొంగి కాకర్లతోట-ఏపీఎంసీ వెళ్ళే మార్గంలో నీటి పరవళ్లు

హోసూరు జోన్

మామిడిజ్యూస్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్





మామిడి జ్యూస్ ఫ్యాక్టరీలో కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), జూన్ 8: కృష్ణగిరి జిల్లా కావేరిపట్టణం పంచాయతీ జెగదాబ్ గ్రామంలో మామిడిజ్యూస్ ఫ్యాక్టరీని కలెక్టర్ సరయు శనివారం సందర్శించారు. పారిశ్రామిక వేత్తలు, వ్యాపార సంస్థలను ప్రోత్సాహించడానికి 2023-24 లో ప్రధానమంత్రి యోజన పథకంలో భాగంగా మామిడి పండు అధికంగా పండించే ప్రాంతం కావడంతో వల్ల మామిడి గుజ్జు పరిశ్రమల అభివృద్ధికి కృష్ణగిరి జిల్లా ఎంపికైంది. కలెక్టర్ కె.ఎం.సరయు ఫ్యాక్టరీలోని పలు విభాగాలను పరిశీలించారు. రైతుల నుంచి మామిడి కాయల సేకరణ, మొదటిదశ శుద్ది పనులు, ఆధునిక యంత్రాలతో మామిడి గుజ్జు తయారీ, డబ్బాలలో మామిడిగుజ్జు నిల్వ, శీతలగదులలో ప్రాసెసింగ్ పనులు, విదేశాలకు ఎగుమతి వంటి విభాగాలను పరిశీలించారు. పల్ప్ తయారీ కంపెనీ నిర్వాహకులు ఫ్యాక్టరీ పనితీరును కలెక్టర్‌కు వివరించారు. జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ ప్రసన్న బాలమురుగన్, ప్రాజెక్టు మేనేజర్ రామమూర్తి , కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మాధవన్ ఉన్నారు.

వారాంతంలో ట్రాఫిక్ రద్దీ

హోసూరు, జూన్ 8: కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపంలోని చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిపై వారాంతంలో క్రమేపీ రద్దీ పెరుగుతోంది. దీంతో శనివారం కూడా గంటల తరబడి వందలాది వాహనాలు బారులు తీరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారాంతంలో శని, ఆదివారాలు సెలవులు కావడంతో చాలామంది బెంగళూరు సహా కర్ణాటక నుంచి తమ స్వగ్రామాలకు వస్తుంటారు. అదే విధంగా చాలామంది తమిళనాడుకు వస్తుంటారు. సరిహద్దులోని రోడ్డులో ఇరువైపులా వందలాది వాహనాల సంచారం మందగతిన సాగింది. ఇలా సుమారు 5 కిలోమీటర్ల పాటు ట్రాఫిక్‌జామ్ నెలకొంది. సమయానికి గమ్యస్థానం చేరుకోలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



ట్రాఫిక్‌లో ఆగిపోయిన వాహనాలు

ప్రతిపక్ష నాయకుల ఆరోపణలు సత్యదూరం

రాయచూరు, జూన్ 8 : కర్ణాటక మహర్షి వాల్మీకి డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతికి సంబంధించి తన ప్రమేయం ఉందంటు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ శనివారం ఒక ప్రకటన ద్వారా ఖండించారు. ఇందులో తన ప్రమేయం ఉందని తన ప్రత్యర్థులు చేస్తున్న ఆరోపణలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఒక వేళ వారి దగ్గర అవినీతికి సంబంధించి చేసే ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలున్నా వాటిని విచారణ అధికారులకు అందజేయాలన్నారు. అవినీతి జరిగిన అంశానికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విచారణ కోసం సీబీఐకి లేఖ రాసిందని రూరల్ ఎమ్మెల్యే తెలిపారు. కేవలం తన పై రాజకీయ వ్యతిరేకతతోనే ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని ప్రత్యర్థులకు సూచించారు.

మస్కి జలాశయానికి పెరిగిన ఇన్ ఫ్లో



జలాశయంలో 15 అడుగుల మేర నిల్వ ఉన్న నీరు

రాయచూరు, జూన్ 8 : గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాయచూరు జిల్లాలోని మస్కి జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగింది. 0.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న జలాశయంలో ఇప్పటికే 15 అడుగుల మేరకు నీరు చేరిందని అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం నిండేందుకు మరో 14 అడుగుల నీరు రావల్సి ఉందని శనివారం ఇంజనీయర్ దావుద్ తెలిపారు.

చెల్లెలు మృతి వార్త విని ఆగిన అన్న గుండె

రాయచూరు, జూన్ 8 : అనారోగ్యంతో ఉన్న చెల్లెలు మృతి చెందిందని తెలుసుకున్న అన్న గుండెపోటుతో అక్కడికక్కడే పడి మృతి చెందిన సంఘటన జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. శావంతగల్ గ్రామానికి చెందిన అంబికా అనే యువతి నాల్గు రోజుల క్రితం అనారోగ్యానికి గురికాగా ఆమెను సమీపంలోని సిరవార పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చి చికిత్సనందించారు. చికిత్స పొందుతున్న యువతి శనివారం ఉదయం మృతి చెందడంతో అక్కడే ఉండి విషయం తెలుసుకున్న అన్న వెంకటేశ్(15) గుండెపోటుకు గురై మరణించాడు. చెల్లెలు మృతి చెందిన అరగంటలోగానే అన్న మృత్యువాత పడడంతో దేవదుర్గ తాలూకా శావంతగల్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.

పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించాలి

రాయచూరు, జూన్ 8 : పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరు తమ బాధ్యతగా భావించాలని అటవిశాఖ అధికారి రాజేశ్ నాయక్ కోరారు. ఇంటికొక్క మొక్కను నాటి సంరక్షించడం ద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు సహకరించాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తాలూకాలోని కాడ్లూరు గ్రామంలో కొట్నూరు బసవేశ్వర స్నేహ సమితి సహకార సంఘం ఆధ్వర్యంలో ఇంటికొక మొక్కను పంపిణీ చేశారు. బసవేశ్వర యువకమండలితో కలిసి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి ఒక మొక్కను అందజేసి దాన్ని సంరక్షించాలని గ్రామస్థులకు సూచించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

డూండీ (జయంతి)




డూండేశ్వర రావు పోతిన 1932 జూన్ 9 బెజవాడలో జన్మించారు. 'డూండీ'గా పేరొందారు. తెలుగు సినీరంగంలో ప్రముఖ నిర్మాతగా పేరొందారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి సినిమా థియేటర్ రూపొం దించిన పోతిన శ్రీనివాసరావు కుమారుడు. తెలుగు, కన్నడ, హిందీలో 29 సినిమాలు నిర్మించారు. సూపర్‌స్టార్ కృష్ణ నటించిన 'గూఢచారి 116' సినిమాతో గుర్తింపు పొందారు. 2005లో నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 2007 జనవరి 1న కన్నుమూశారు.

చార్లెస్ డికెన్స్ (వర్ధంతి)



చార్లెస్ జాన్ హాఫమ్ డికెన్స్ 1812 ఫిబ్రవరి 7న జన్మించారు. విక్టోరియా రాజుల కాలంలో ఆంగ్లంలో గొప్ప నవలా రచయిత. సామాజిక అంశాలపై రచనలు చేసేవారు. ది పిక్‌విక్ పేపర్స్‌లో 1836లో ఆయన రచనలు సీరియల్‌గా ప్రచురితమయ్యాయి. సున్నితమైన హాస్యం, విమర్శ, సమాజాన్ని ఆలోచించేవిధంగా రచనలు ఉండడంతో అతితక్కువ ఏళ్లలోనే ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. 1859లో 'ఏ టేల్ ఆఫ్ టు సిటీస్' (లండన్ అండ్ ప్యారిస్) నవల ఎంతో పేరొందింది. 1870 జూన్ 9న కన్నుమూశారు.

ఎన్‌జీ రంగా (వర్ధంతి)



'పద్మవిభూషణ్' ఆచార్య ఎన్‌జీ రంగాగా పేరొందిన గోగినేని రంగనాయకులు 1900 నవంబరు 7న గుంటూరులో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, పార్లమెంటు సభ్యుడు, రైతు నాయకుడు. రైతాంగ విధానాలకు మద్దతు ఇచ్చిన ఈయనను భారత రైతాం గ ఉద్యమపితగా భావిస్తారు. రైతు కూలీ ఉద్యమానికి నేతృత్వం వహించారు. తర్వాత కిసాన్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. స్వతంత్ర్య పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా దశాబ్దంపాటు కొనసాగారు. సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యుడిగా వ్యవహరిం చా రు. 1995 జూన్ 9న తుదిశ్వాస వీడారు. ఆయన పేరిట జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించారు.

కిరణ్ బేడి (పుట్టినరోజు)



తొలి మహిళా ఐపీఎస్ అధికారిణిగా గుర్తింపు పొందిన కిరణ్ బేడి 1949 జూన్ 9న అమృత్‌సర్‌లో జన్మించారు. 1972 నుంచి 35ఏళ్లపాటు వివిధ హోదాలలో కొనసాగారు. 2007లో డైరెక్టర్ జనరల్ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)గా స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. 2016-2021 వరకు పుదుచ్చేరికి 24వ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కొనసాగారు. కాగా 1993లో ఢిల్లీ ప్రిజన్స్‌కు ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. తీహార్ జైలులో పలు సంస్కరణలు తెచ్చారు. 1994లో రామన్ మెగ సెసె అవార్డు పొందారు. 2003లో యునైటెడ్ నేషన్స్ పోలీస్‌కు హెడ్‌గా వ్యవహరించిన తొలి భారతీయ మహిళ. ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్, మదర్ తెరెసా మెమోరియల్ నేషనల్ అవార్డు తదితర గౌరవాలు పొందారు.

పాల్ బెట్టి (పుట్టినరోజు)



'ది మ్యాన్ బుకర్ ప్రైజ్' గ్రహీత పాల్‌బెట్టి 1962 జూన్ 9న జన్మించారు. అమెరికాకు చెందిన ఆయన 2015లో నేషనల్ బుక్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డు, 'ది సెల్ అవుట్' నవలకు 2017లో ఇంట ర్నేషనల్ డబ్లిన్ లిటరరీ అవార్డు. 1990లో గ్రాండ్ పోయెట్రీ స్లామ్ ఛాంపియన్‌గా నిలిచారు. ఆయన రచించిన నవలలకు పాఠకులనుంచి ఉత్తమస్పందన వ్యక్తమైంది. కొలంబియా యూనివర్శిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.

అనుష్క శంకర్ (పుట్టినరోజు)



అనుష్క శంకర్ 1981 జూన్ 9న లండన్‌లో జన్మించారు. సితార్ కళాకారులు పండిట్ రవి శంకర్ కుమార్తె. ఈమె కూడా సితార్ విద్వాంసురాలు. 13వ యేటనే తొలి ప్రదర్శన ఇచ్చారు. దేశ విదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి పేరొందారు. సింగర్ నోరాజోన్స్‌తో కలిసి గ్రామీ అవార్డు అందుకుని పాపులర్ అయ్యారు. పాన్ ఏషియన్ గర్ల్‌బ్యాండ్ ఏర్పాటుకు నడుంబిగించారు. చైనా, జపాన్, కొరియా, ఫిలిప్పీన్స్‌తో పాటు ఇండియానుంచి ఒక్కొక్క పాప్ ఆర్టిస్టును ఎంపిక చేయనున్నారు. ఐక్యరాజ్య సమితిలో వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు దేశం నుంచి ప్రతినిధిగా ఉన్నారు.

సోనం కపూర్ (పుట్టినరోజు)



స్టైల్ ఐకాన్‌గా పేరొందిన సోనం కపూర్ అహూజా 1985 జూన్ 9న జన్మించారు. హిం దీలో ప్రముఖ నటుడు అనిల్ కపూర్ కుమార్తె. సినీరంగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రవేశించి నటిగా పేరొందారు. అత్యధిక రెమ్యూనరేషన్ అందుకుంటున్న నటీమణులలో ఒకరు. నేషనల్ ఫిల్మ్ అవార్డు, 4 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అం దుకున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు.

కర్ణాటక పాడి రైతులు దేశానికే ఆదర్శం

పావగడ, జూన్ 8: కర్ణాటక పాడి రైతులు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వెంకటేశ్ అన్నారు. శనివారం సీకేపురం గ్రామంలో పాల ఉత్పాదకుల మహిళా సహకార సంఘాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. తుమకూరు జిల్లా కర్ణాటక పాల ఉత్పాదనలో మొదటిస్థానంలో ఉందని, రాష్ట్రం దేశంలోనే పాల ఉత్పత్తిలో మొదటి స్థానం పొం దిందన్నారు. ఇదివరకు పురుష సంఘాలు ఏర్పాటు ఉండ గా, నేడు మహిళలు కూడా పాల ఉత్పాదన సంఘం ఏర్పాటు చేసి మహిళా సబలీకరణకు ముందడుగు వేయడం గర్వకారణమని మాజీ ఎమ్మెల్యే వెంకటరమణప్ప అన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

శిడ్లఘట్ట, జూన్ 8: చక్కగా చదువుకుని ప్రయోజకులు కావడం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమని జేడీఎస్ యువ నాయకుడు నవీన్‌కుమార్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మళమాచనహళ్ళిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రి పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవనంలో ఉత్తమ ఆరోగ్యం, విద్య ద్వారా ఉన్నతమైన వ్యక్తిత్వం సాధ్యమన్నారు. ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ తాలూకా అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆరోగ్య, విద్య, మౌలిక సదుపాయాలను మెరుగు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రి సమకూరుస్తున్నారన్నారు. కాగా ఈసారి ప్రభుత్వ హైస్కూల్‌లో ఎస్‌ఎస్‌ఎల్‌సీ ఫలితాల్లో ఉత్తీర్ణతశాతం తగ్గడం బాధ కలిగించిందన్నారు. ఇలా పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామపెద్ద జగదీశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా సామాన్య, మధ్యతరగతి వర్గాలపిల్లలు ఉంటారని వారి కోసం ఎమ్మెల్యే సహకారంతో నోటుపుస్తకాలు, లేఖనా సామగ్రి ఉచితంగా సమకూర్చారని సద్వినియోగం చేసుకుని చక్కగా చదవాలని కోరారు. తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు ఎంకే రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం చిన్నదిగా ఉందని, క్రీడా మైదానం కొరత ఉందన్నారు. ఇప్పటికే ఈ అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చామని త్వర లోనే ప్రాథమిక పాఠశాలను హైస్కూల్‌కు మార్పు చేసి విద్యార్థులకు అనుకూలం చేస్తామన్నారు.



పుస్తకాలతో విద్యార్థులు, గ్రామ ప్రముఖులు

కార్యక్రమంలో మళమాచనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం అధ్యక్షుడు రామచంద్రచారి, మాజీ అధ్యక్షుడు దేవరాజ్, డైరెక్టర్ వెంకటేశ్, మనోహర్, గ్రామ ప్రముఖులు కేశవ మూర్తి, శ్రీనివాస్, మునిస్వామిగౌడ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య లా కళాశాలలో పోలీసులకు శిక్షణ

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మూడు కొత్త క్రిమినల్ చట్టాలపై జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య గ్లోబల్ లీగల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో రామయ్య లా కళాశాలలో రెండు రోజుల శిక్షణలు జరిగాయి. జూలై ఆరంభంనుంచి అమలులోకి వచ్చే కొత్త చట్టాలపై వివిధ కేడర్‌లకు చెందిన 550మంది పోలీసులకు శిక్షణ ఇచ్చారు. బెంగళూరు ఉత్తర, సెంట్రల్ విభాగాలకు చెందిన లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల డీసీపీలు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఎంఎన్ వెంకటాచలయ్య శిక్షణా తరగతులను ప్రారంభించారు. న్యాయవాద వృత్తి, చట్టాలకు సంబంధించి నైపుణ్యత ముఖ్యమని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ముఖ్య అధికారి బీఎస్ రాంప్రసాద్ అభిప్రాయపడ్డారు రామయ్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలకు పోలీసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారన్నారు. పోలీసుల్లోనూ కొత్త చట్టాలపై అవగాహన ముఖ్యమన్నారు. చట్టాల అమలు చేసేవారికి సమగ్రత ముఖ్యమని అందుకే తర్ఫీదు ఇచ్చామన్నారు. జూలై నుంచి అమలులోకి వచ్చే క్రిమినల్ చట్టాలపై ప్రజల్లోనూ అవగాహన పెరగాల్సి ఉందన్నారు. రామయ్య లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఉమామహేశ సత్యనారాయణ మాట్లాడుతూ రెండు రోజుల శిక్షణలకు పోలీసు ఉన్నతాధికారులు భాగస్వామ్యులయ్యారన్నారు. సి ప్రణమ్‌తోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ముఖ్యులుగా పాల్గొన్నారు. ఎంఎన్ వెంకటాచలయ్య మాట్లాడుతూ ఈఎస్ వెంకటరామయ్య గ్లోబల్ లీగల్ స్కిల్స్ అకాడమీని 2023 డిసెంబరులో శ్రీకారం చుట్టారన్నారు. పోలీసులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణా శిబిరం ఉత్సాహంగా ముగిసింది.

ఒకే తేదీన పుట్టిన దంపతులు.. ఒకేరోజు కన్నుమూత

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఒకేతేదీన పుట్టిన ఆదర్శదంపతులు ఒకే రోజు కన్నుమూసిన సంఘటన బంధు మి త్రులను కలవరపరిచింది. ఉత్తరా ఖండ్ లోని ఎత్తైన ప్రదేశం సహస్రస్థళ్ మైయాళీకి పర్వతారోహణకు కర్ణాటకనుంచి వెళ్లిన 19 మందిలో వాతావరణం ప్రతికూలం కార ణంగా 9మంది మృతి చెందిన సంఘటన తెలిసిందే. మృతులలో హుబ్బళ్ళికి చెందిన దంపతులు ఉన్నారు. హుబ్బళ్ళి నగరం వినాయక ముంగరవాడి, సుజాత ముంగరవాడిలు దంపతులు. వినాయక ముంగరవాడి 1969 అక్టోబరు 3న జన్మించారు. ఆయన భార్య సుజాత ముంగరవాడి 1972 అక్టోబరు 3న జన్మించారు. హుబ్బళ్ళి బీవీబీ ఇంజనీరింగ్ కళాశాలలో చదివారు. ప్రస్తుతం బెంగళూరులో నివసిస్తున్నారు. వివాహం జరిగాక సంవత్సరాలు వేరైనా... ఒకే తేదీన వీరు జన్మించడంతో ఏటా వేడుకలు సంతోషంగా జరుపుకొనేవారు. వీరు ఏటా పర్వతారోహణకు వెళ్లేవారు. ఉత్తరకర్ణాటక స్నేహలోక ట్రస్టు ద్వారా సామాజిక సేవలు కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ట్రెక్కింగ్‌కు పిల్లలతోపాటు వెళ్లాలని భావించారు. అయితే ఇద్దరికి మాత్రమే టిక్కెట్‌లు లభించడంతో దంపతులు వెళ్లారు. మంగళవారం పర్వతారోహణవేళ దంపతులు మృతి చెందారు. శనివారం వీరి మృతదేహాలు హుబ్బళ్ళికి తీసుకురావడంతో బంధుమిత్రుల ఆర్తనాదాలు మిన్నంటాయి.



వినాయక, సుజాత దంపతులు (ఫైల్)

పెట్టుబడులే లక్ష్యంగా టెక్ సమ్మిట్

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ది ఎలక్ట్రానిక్‌సిటీ ఇండస్ట్రియల్ అసోసియేషన్ (ఎలిసియా) ఏర్పాటు చేసిన టెక్ సమ్మిట్ సన్నాహకసభలో ప్రభుత్వ పారిశ్రామిక విభాగం కార్యదర్శి సెల్వకుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెల్వకుమార్ మాట్లాడుతూ పెట్టుబడులే లక్ష్యంగా టెక్ సమ్మిట్ జరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో ఐటీ, బయోటెక్నాలజీ, కామర్స్, ఏరోస్పేస్ వంటి విభాగాల్లో దేశంలోనే ముందంజలో ఉన్నాయన్నారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. జూలై 26న టెక్ సమ్మిట్ జరగనుందాన్నరు. ఎలిసియా అధ్యక్షుడు రామకుమార్‌తోపాటు పలువురు ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు.



ఎలిసియా సమావేశంలో ప్రతినిధులు తదితరులు

పౌరకార్మిక సంఘానికి నూతన పదాధికారులు



నూతన పదాధికారులకు సన్మానం

విజయనగర్, జూన్ 8: జగజ్జీవన్‌రాంనగర్‌లోని రాష్ట్ర పౌరకార్మిక, సఫాయి కర్మచారి వర్కర్స్ యూనియన్‌కు నూతన పదాధికారులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పౌరకార్మిక పితామహగా పేరొందిన ఐపీడీ సాలప్ప అప్పట్లో సఫాయి కర్మచారుల అభివృద్ధికోసం ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక సమర్పించారన్నారు. మూడేళ్లపాటు సుదీర్ఘ అధ్యయనం అనంతరం సమర్పించిన నివేదికలో 17 అంశాలతో 96 సిఫారసులు ఉన్నాయని వీటిలో 36 సిఫారసులకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ప్రస్తుతం 36 సిఫారసులకుగాను 17 అమలు అయ్యాయని మిగిలిన 19 సిఫారసులలో మాన్యువల్ స్కావెంజర్స్ అభివృద్ధికి రిజర్వేషన్లు తదితర అంశాలు ఉన్నాయన్నారు. ప్రతి 500మంది జనాభాకు ఒక పర్మనెంట్ పౌరకార్మికుడు నియమించాలనే సిఫారసు ఉందని, ఎవరైనా సెలవులపై వెళ్తే విధులకు ఇబ్బంది లేకుండా కనీసం అదనంగా 10శాతం సిబ్బంది నియమించాలనే ప్రతిపాదన ఉందన్నారు. ఏడాదిపాటు కంట్రాక్టు లేదా దినకూలీ పద్ధతిన పనిచేస్తే వారికి స్థానిక సంస్థలలో పర్మనెంట్ చేయాల్సి ఉందన్నారు. చెత్తను తరలించే ఆటో, లారీ డ్రైవర్‌లు, లోడర్స్‌ను కూడా పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు త్వరలోనే బీబీఎంపీ ఉన్నతాధికారులకు ఒక వినతిని సమర్పించనున్నట్టు తెలిపారు. నూతన పదాధికారులను పలువురు అభినందించారు.

కరవే ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ

చింతామణి, జూన్ 8: ప్రభుత్వ పథకాలను పొందేందుకు పలువురు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతారని అదే రీతిన తమ పిల్లలను కూడా ప్రభుత్వపాఠశాలలకు పంపడం ద్వారా ప్రభుత్వ ప్రయోజనాలను పొందాలని కర్ణాటక రక్షణా వేదిక జిల్లా అధ్యక్షుడు ఎంఆర్ లోకేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని తిమ్మసంద్ర గ్రామం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రిని పంపిణీ చేశారు. కరవే రాష్ట్ర అధ్యక్షుడు టీఏ నారాయణగౌడ పుట్టినరోజును పురస్కరించుకుని కార్యక్రమాన్ని అర్థవంతంగా నిర్వహించినట్టు లోకేశ్ తెలిపారు. ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే మహిళలు తమ పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కరవే తాలూకా అధ్యక్షుడు వీఎం నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, గ్రామ ప్రముఖుడు, కోచిముల్ మాజీ డైరెక్టర్ లక్ష్మణ్‌రెడ్డి, నగరసభ మాజీ సభ్యుడు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలతో విద్యార్థులు తదితరులు

నీట మునిగిన రహదారి

బంగారపేట, జూన్ 8: తాలూకాలో ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షానికే మాగేరి గ్రామంలో రోడ్డు పూర్తిగా నీటితో మునిగింది. దీంతో రాకపోకలకు తీవ్రం అంతరాయం నెలకొంది. వెంటనే రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు శనివారం నిరసన తెలిపారు. మాగేరి గ్రామ శివారులో నాలుగైకుటుంబాలు ఐదారు దశాబ్దాలుగా ఉన్నాయి. రోడ్డుపక్కన వర్షపునీటి సేకరణ కోసం చెక్‌డ్యామ్ నిర్మించారు. అయితే రోడ్డు పక్కన ఉన్న భూమి కొంతమంది ఆక్రమించడంతో వర్షపునీరు రోడ్డుపై నిల్వగా మారి కుంటగా ఉంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



రోడ్డుదుస్థితిపై నిరసన ఇలా..

అంటకాగిన వారిలో ఆందోళన

కళ్యాణదుర్గం, జూన్ 8: కూటమి విజయంతో వైసీపీతో అంటకాగిన అధికారుల్లో గుబులు మొదలైంది. నియోజకవర్గంలోని వివిధ శాఖల్లో ఐదేళ్ల పాటు వైసీపీకి కొమ్ముకాసిన సుమారు 55 మంది అధికారులు తట్టాబుట్టా సర్దుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే బదిలీ ప్రయత్నాలను ప్రారంభించారు. వీరిలో మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు, ఎంపీడీఓ కార్యాలయాల అధికారులు, పంచాయతీ రాజ్ కార్యాలయ అధికారులు ఉన్నారు. వైసీపీ పాలనలో వీరందరూ ఆ పార్టీ నాయకులకు వంత పాడుతూ పబ్బం గడుపుకున్నారు. వైసీపీ ఘోర పరాజయంతో వారిలో ఆందోళన మొదలైంది. ఇక్కడే ఉంటే తప్పులు బయట పడతాయని, ఇబ్బందులు ఎదురవుతాయని ముందు జాగ్రత్తకు పోతున్నారు.

ఆర్‌ఐ అక్రమార్జన

కళ్యాణదుర్గం పట్టణంలో ఒక ఆర్‌ఐ వైసీపీ నాయకులతో అంటకాగారు. ఆ పార్టీ నాయకులు అడిగిందే తడవు.. రెవెన్యూ శాఖలో పనులన్నీ చక్కబెట్టేవారు. గడిచిన ఐదేళ్లలో ఆయన రూ.కోట్లు ఆర్జించారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ సంపాదనతో భారీగా భూములను కొనుగోలు చేశారని సమాచారం. వైసీపీకి వీరవిధేయుడిగా పనిచేశారన్న విమర్శలు ఉన్నాయి. రెవెన్యూ శాఖలో ఇప్పటికీ ఆయన పెత్తనం నడుస్తోందని సమాచారం.

ఒకరికి మించి ఒకరు..

- పంచాయతీ రాజ్ శాఖలో పనిచేసే ఓ కీలక అధికారి వైసీపీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారు. కోట్లాది రూపాయలు అక్రమంగా ఆర్జించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పనులు చేయకపోయినా బిల్లులు డ్రాజేసి రూ.కోట్లలో వెనకేసుకున్నారని సమాచారం. పనులు, బిల్లుల విషయంలో ఆయన వైసీపీ నాయకులకు కల్పతరువుగా ఉండేవారని ప్రచారం ఉంది.
- ట్రాన్స్‌కోలో పనిచేసే ఓ కీలక అధికారి వైసీపీ నాయకులు ఏది చెబితే అది చేశారు. వారి అండతో ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా వ్యవహరించారు. ట్రాన్స్‌కో కార్యాలయాల్లో ఇష్టానుసారంగా ఉద్యోగాలు ఇప్పించారని ఆరోపణలు ఉన్నాయి. రూ.రెండు కోట్లకు పైగా అక్రమాలకు పాల్పడ్డారని బహిరంగ చర్చ జరుగుతోంది.
- మండల పరిషత్ కార్యాలయాలు, ఉపాధి హామీ పథకం పనుల్లో వైసీపీకి వీరవిధేయుడిగా పనిచేసిన అధికారులు ఇప్పటికీ హవా నడిపిస్తున్నారు.
- కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ వైద్యుడు వైసీపీ నాయకులు చెప్పిందల్లా చేస్తుంటారు. ఇప్పటికీ ఆయన కనుసన్నల్లోనే ప్రభుత్వాస్పత్రి నిర్వహణ సాగుతోంది.
- కంబదూరు, కుందుర్పి శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో పనిచేస్తున్న పలువురు అధికారులు వైసీపీ నాయకులతో అంటకాగారు. నిబంధనలకు తిలోదకాలిచ్చారు. కంబదూరు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఒక అధికారి కీలక అధికారులను డమ్మీలుగా మార్చారు. వైసీపీ నాయకుల అండతో రెచ్చిపోయారు. ఆ అధికారి చెప్పిందే శాసనం అన్నట్లుగా వ్యవహారాలు సాగాయి.
- పోలీసు శాఖలో కొందరు శాంతిభద్రతల పరిరక్షణకు కాకుండా, వైసీపీ నాయకులు చెప్పింది చేయడానికే ఉన్నట్లుగా వ్యవహరించారు. వైసీపీ ఓటమితో ఇక ఇక్కడే ఉంటే ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. బదిలీకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

అక్షర యోధుడికి అశ్రునివాళి

బెంగళూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దినపత్రిక ద్వారా సంచలనాలకు కారకుడై ఎన్నో వ్యాపారాల ద్వారా వేలాదిమందికి ఉపాధి కల్పించిన ప్రముఖుడు అక్షర యోధుడు రామోజీరావుకు అశ్రునివాళి అంటూ రాష్ట్ర పాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్ ఆర్‌వీ దేశ్‌పాండే సంతాపం తెలిపారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ఉషాకిరణ్ మూవీస్, రామోజీ ఫిలింసిటీ వంటి చారిత్రాత్మకమైన విభాగాలు రామోజీరావుతోనే సాధ్యమయ్యాయన్నారు. ఆయన మృతి తీరని లోటు అని, ఆత్మకు శాంతి లభించాలని కోరుకుంటున్నా అన్నారు. మరో ప్రకటనలో తెలుగు విజ్ఞాన సమితి తీవ్రంగా విచారం వ్యక్తం చేసింది. తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు ప్రకటన ద్వారా ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అక్షర యోధుడిగాను తెలుగు భాషా సంస్కృతులకోసం ఆయన ఎన్నో సేవలు చేశారన్నారు. ఆయన ప్రారంభించిన ప్రతి వ్యాపారం చారిత్రాత్మకమనేలా అభివృద్ధి చేశారని కొనియాడారు. రామోజీరావు మృతికి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సమాజానికి రామోజీరావు ఓ సంచలనమని, ఒక ఆదర్శమని బెంగళూరు టీడీపీ ఫోరం ప్రకటించింది. ఈమేరకు రామోజీరావు మృతి పట్ల బీటీఎఫ్ కార్యాలయంలో సంతాపం తెలిపారు.

రామోజీరావు అందరికీ మార్గదర్శకులు

రామోజీరావు అందరికీ మార్గదర్శకులని రేవా యూనివర్సిటీ చాన్సలర్ పి.శ్యామరాజు అభిప్రాయపడ్డారు. రామోజీరావు మృతిపై ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం మెచ్చేలాంటి రామోజీ ఫిలింసిటీ నిర్మించారని, ఈనాడు, ఈటీవీల ద్వారా దేశమంతటా సమాచార విప్లవం సాధించారన్నారు. కళాంజలి ద్వారా వస్త్ర వ్యాపారం డాల్ఫిన్ హోటల్స్, ప్రియా పచ్చళ్లు, ఉషాకిరణ్ మూవీస్ ద్వారా సినిమాలు, మయూరి డిస్ట్రిబ్యూటర్ ద్వారా సినిమాలు విడుదల చేయిం చారన్నారు. ఇలా ఎన్నో రంగాలలో రాణించిన రామోజీరావు సమాజానికి ఆదర్శప్రాయులన్నారు.

టిప్పర్.. బైక్ ఢీ: ఒకరి మృతి



ఘటనా స్థలంలో బైక్‌ను ఢీ కొన్న టిప్పర్

దొమ్మసంద్ర, జూన్ 8: చిక్క తిరుపతి - సర్జాపుర మార్గంలో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ లారీ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందారు. స్నేహితుడి భార్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో పరామర్శించి వాపసు వస్తుండగా శనివారం సాయంత్రం టిప్పర్ లారీ ఢీ కొంది. దీంతో బైక్‌పై వస్తున్న నవీన్ (25) మృతి చెందాడు. సర్జాపుర పోలీస్ అధికారి నవీన్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ సర్జాపుర గ్రామంలో ఇటీవలికాలంలో ప్రమాదాలు పెరిగాయని రింగ్ రోడ్డు ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య తగ్గనుందని అభిప్రాయపడ్డారు.